క్లుప్తంగా

వృద్ధులకు అల్పాహారం పంపిణీ



నెల్లూరు(మినీబైపాస్): గీతామయి వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు అమ్మ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అల్పాహారం పంపిణీ చేశారు. రాజ్ రిఫ్రిజిరేషన్స్ అధినేత వినోద్ పుట్టిన రోజును పురస్కరించుకుని వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి అల్పాహారాన్ని పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ సేవకుడు రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో శశి కిరణ్, కార్తికేయ, వంశీ, రమేష్‌బాబు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

వెంకటాచలం: మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో జీఎస్ఆర్ మినరల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న మానుజప్ప(40) కనిపించడం లేదని మేస్త్రి రవిచంద్ర వెంకటాచలం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కర్ణాటక రాష్ట్రం,మాండ్య జిల్లా, శ్రీరంగపట్నం మండలం, మొగరాహళ్లి గ్రామానికి చెందిన మానుజప్ప, మరికొందరు మేస్త్రి రవిచంద్రతో కలిసి జీఎస్ఆర్ మినరల్స్ కంపెనీలో పని చేస్తున్నారు. ఈనెల 5వ తేదీ నుంచి మానుజప్ప కనిపించకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలతో పాటు స్వగ్రామంలో కూడా విచారించారు. అయితే మానుజప్ప ఆచూకీ తెలియకపోవడంతో మేస్త్రి రవిచంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనుబోలులో రైతు సంఘ సమావేశం

మనుబోలు : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ సమావేశాన్ని మనుబోలులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కన్వీనర్ గంగపట్నం రమణయ్య మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. రెండెకరాల వరకు సాగు చేస్తున్న రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు షానవాజ్, రమణయ్య, నారాయణ, వెంకటరమణయ్య, రమేష్, చినరమణయ్య ఉన్నారు.

జిమ్ కిట్ అందజేత

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని ఇస్కపాళేనికి చెందిన యువకులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కోడూరు మధుసూదన్‌రెడ్డి ఆదివారం జిమ్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం అవసరమన్నారు. ఇందులో భాగంగా స్థానిక యువతకు జిమ్ కిట్ అవసరమని ఇటీవల కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిని కోరగా ఆయన వెంటనే అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కిరణ్ పాల్గొన్నారు.

పొదుపు సభ్యుల నమోదును పూర్తిచేయాలి

కొడవలూరు: ఎన్ఆర్ఎల్ఎం(నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్)లో పొదుపు సభ్యుల వివరాల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి సూచించారు. మండలంలోని గండవరంలో పొదుపు గ్రూపుల లీడర్లతో ఆదివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పొదుపు సభ్యురాలి ఆధార్, బ్యాంక్ ఖాతా, ఫోన్ నంబర్‌లను లోకోస్ యాప్‌లోని ఎన్ఆర్ఎల్ఎంలో విధిగా నమోదు చేయాలన్నారు. మండలంలో 1,255 పొదుపు గ్రూపులుంటే ఇప్పటి వరకు 850 గ్రూపులకు సంబంధించిన సభ్యుల వివరాలు మాత్రమే పరిపూర్ణంగా నమోదు చేశారన్నారు. నమోదు కాని సభ్యుల వివరాలను వారం రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. నమోదు సమయంలో పొదుపు సభ్యుల ఫొటోలను విధిగా తీయాల్సి ఉన్నందున వారు అందుబాటులో ఉండాలన్నారు. ఎన్ఆర్ఎల్ఎంలో నమోదైన సభ్యులే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంక్ రుణాలకు అర్హులవుతారని స్పష్టం చేశారు. నమోదు కాని సభ్యులు వీఓఏలను సంప్రదించి విధిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీ మమత, వీఓఏ ప్రభావతి, సంఘ బంధం అధ్యక్షురాలు విజయమ్మ, పొదుపు గ్రూపుల లీడర్‌లు పాల్గొన్నారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

కొడవలూరు: కోవూరు సెబ్ స్టేషన్ ఆవరణలో మూడు వాహనాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ సీఐ ఆర్. నరహరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఈబీ అధీనంలోని మహేంద్ర బొలెరో పికప్ ఎల్ఎంవీ, బజాజ్ పల్సర్, టీవీఎస్ రైడర్ మోటార్ సైకిళ్లకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహేంద్ర బొలెరో వాహనం ధర రూ.4.50 లక్షలు, బజాజ్ పల్సర్ రూ.24 వేలు, టీవీఎస్ రైడర్ రూ.47 వేలుగా నిర్ణయించినట్లు చెప్పారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు నిర్ణయించిన ధరలో పది శాతం చెల్లించాలని, దీని ప్రకారం బొలెరో వాహనానికి రూ.45 వేలు, పల్సర్ బైక్‌కు రూ.2,400, టీవీఎస్ రైడర్‌కు రూ.4,700 వంతున ధరావత్తు చెల్లించి కోవూరు ఎస్ఈబీ స్టేషన్ వద్ద ఉదయం 10.30 గంటలకు జరుగనున్న బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు.

- ఈ ఫొటోలోని మహిళ పేరు షేక్ ఆయేషా. నెల్లూరు రూరల్ పరిధిలోని శ్రామికనగర్‌కు చెందిన ఈమె టైలరింగ్, ఫ్యాన్సీ షాపుపై ఆధారపడి జీవనం సాగిస్తోంది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె లాల్ సల్మా ఏడో తరగతి చదువుతోంది. చిన్న కుమార్తె రెహ్మత్ సాధియా శ్రామికనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. చిన్నకుమార్తెకు సంబంధించి ప్రభుత్వం అమ్మఒడి నగదును ఆయేషా బ్యాంకు ఖాతాలో జమచేసింది. దీంతో పిల్లల బుక్స్, దుస్తులు, ఇతర ఖర్చులకు ఇబ్బంది లేకుండా పోయిందని ఆమె హర్షం వ్యక్తం చేసింది.



- ఈ ఫొటోలోని మహిళ పేరు యల్లంపల్లి సుభాషిణి. నెల్లూరు రూరల్ పరిధిలోని రవిచంద్ర గిరిజన కాలనీలో నివాసం ఉంటోంది. కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తోంది. ఈమెకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు ఏడో తరగతి. రెండో కుమారుడు శ్రామికనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాడు. రెండో కుమారుడికి సంబంధించి గత మూడేళ్లుగా అమ్మఒడి నిధులు ఆమె బ్యాంకు ఖాతాలో జమవుతున్నాయి. దీంతో పిల్లలను ఇబ్బంది లేకుండా చదివిస్తున్నానని ఆమె ఆనందంగా చెబుతోంది.



- ఈ ఫొటోలోని మహిళ పేరు సత్తేటి వాణి. నెల్లూరు రూరల్ పరిధిలోని రవిచంద్ర గిరిజన కాలనీలో నివాసం ఉంటోంది. కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తోంది. ఈమె కుమారుడు మనోహర్ శ్రామికనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం గత మూడేళ్లుగా అమ్మఒడి నగదు బ్యాంకు ఖాతాలో జమచేస్తుండడంతో బుక్స్, దుస్తులు, ఇతర ఖర్చులకు ఇబ్బంది లేకుండా కొడుకును చదివిస్తున్నానని ఆమె సంతోషంగా చెబుతోంది.



పేదింట విద్యాకాంతులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. పేదింటి బిడ్డలు చదువుకు ఇబ్బందులు పడకూడదని ఏటా క్రమం తప్పకుండా అమ్మఒడి పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ.15వేలు నగదు జమ చేస్తున్నారు. ఈ నిధులు పిల్లల చదువులకు కొండంత అండగా నిలుస్తున్నాయి.

అమ్మఒడితో పేద విద్యార్థులకు భరోసా



నెల్లూరు రూరల్ పరిధిలోని కందమూరులో అమ్మఒడి లబ్ధిదారురాలికి ఈకేవైసీ చేస్తున్న వలంటీర్(ఫైల్)

నెల్లూరురూరల్: పేదరికం చదువుకు శాపం కాకూడదు.. ప్రతి విద్యార్థి చదుకోవాలి..చదువుతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని విశ్వసించారు వైఎస్సార్. అందుకే ఆయన సీఎంగా పాలన పగ్గాలు చేపట్టిన తరువాత విద్యార్థుల కోసం ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని రూపొందించి ప్రాణం పోశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు ఇంజినీర్లు, వైద్యులుగా దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. కానీ ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేశాయి. వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత విద్యారంగానికి అధిక ప్రాధాన్యం కల్పించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు వసతుల లేమి, విద్యాబోధన లోపంతో కునారిల్లుతుండేవి. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు తగిన ఆదరణ ఉండేది కాదు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడమే కాకుండా మెరుగైన విద్యాబోధనకు చర్యలు చేపట్టారు. అంతేగాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న పేద విద్యార్థులు ఆర్థిక సమస్యలతో చదువుకు దూరం కాకూడదని అమ్మఒడి పథకానికి శ్రీకారం చుట్టి తల్లుల బ్యాంకు ఖాతాల్లో క్రమం తప్పకుండా ఏటా రూ.15వేలు నగదు జమ చేస్తున్నారు. అమ్మఒడికి విద్యార్థుల హాజరును లింక్ పెట్టడంతో తల్లులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పంపిస్తున్నారు. ఫలితంగా డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గింది.

ప్రభుత్వ పాఠశాలలు ఇలా...

నెల్లూరు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 203 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 18 జెడ్పీ హైస్కూళ్లు, 83 మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలు, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు, 16 నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలు, 9 నగర పాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాలలు, 54 నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 2 ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, 1 సంస్కృత హైస్కూల్, 1 సంస్కృత ప్రాథమిక పాఠశాల, 1 ఏపీ మైనార్టీ హైస్కూల్, 1 ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ఉన్నాయి. వీటిల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 29,170 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో బాలురు 14,060 మంది, బాలికలు 15,110మంది విద్యనభ్యసిస్తున్నారు. నెల్లూరు రూరల్, అర్బన్ ప్రాంతాల్లో 375 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. అందులో 187 హైస్కూళ్లు, 183 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 60,076 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో బాలురు 33,007 మంది, బాలికలు 27,069 మంది ఉన్నారు. గత నెల 28న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం అమ్మఒడి నగదు రూ.13వేలు జమచేసింది. మిగిలిన రూ.2వేలు నగదును స్కూల్ మెయింటెనెన్స్, టాయిలెట్స్ మెయింటెనెన్స్ ఫండ్‌లకు కేటాయించింది. పాఠశాలలు తెరిచిన వెంటనే నగదు జమ చేయడంతో తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మఒడితో ఆర్థిక భరోసా



రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు విద్యాబోధనను మెరుగుపరిచింది. పేద విద్యార్థులు ఆర్థిక సమస్యలతో చదువుకు దూరమవకుండా అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమచేసి ఆర్థిక భరోసా కల్పిస్తోంది. దీంతో డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గింది.

– తిరుపాలు, నెల్లూరు ఎంఈఓ

బీసీల ఏకైక గొంతుక ఎమ్మెల్యే అనిల్

- ఎమ్మెల్యే అనిల్‌పై అసత్య ఆరోపణలను సహించం
- వైఎస్సార్‌సీపీ నాయకురాలు మల్లి నిర్మలమ్మ



మాట్లాడుతున్న మల్లి నిర్మలమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో 15 లక్షల మంది బీసీలు ఉన్నారని, బీసీలను రాజకీయంగా ఎదగనివ్వకుండా చేయాలనే చూస్తే వారికి ఏకైక గొంతుకగా ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు మల్లి నిర్మలమ్మ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. తమ ఎమ్మెల్యే అనిల్ నిజాయితీగా వెల్లడించిన దొంతాలి పొలం విషయంపై టీడీపీ నాయకుడు ఆనం వెంకట రమణారెడ్డి వెటకారంగా మాట్లాడడం మానుకోవాలన్నారు. 30 ఏళ్లకు రాజకీయాల్లోకి వచ్చిన తమ ఎమ్మెల్యే అనిల్ 40 ఏళ్ల వయస్సులో మంత్రి అయ్యాడని, బీసీలను ఎదిగనివ్వకుండా చూస్తే సహించేది లేదన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించి వైఎస్సార్‌సీపీని స్థాపించి ప్రజాక్షేత్రంలో తిరిగి ముఖ్యమంత్రి కాగా, ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీని తమదని చెప్పుకుంటూ లోకేశ్ యాత్ర చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీని వీడిన ముగ్గురు ఎమ్మెల్యేలతో పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. 70 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన ఆనం రామనారాయణరెడ్డికి జగన్‌మోహన్‌రెడ్డి సీటు ఇచ్చి గెలిపిస్తే జారుమిఠాయిలా జారుకున్నారన్నారు. ఆనం వెంకట రమణారెడ్డిని ఇటీవల ఓదార్చడానికి వచ్చిన ఆయన గతంలో ఉరికించి కొట్టింది నిజం కాదాని ప్రశ్నించారు. గతంలో టీడీపీ నుంచి వెంకటరమణారెడ్డి, కిలారిని సస్పెండ్ చేయమని చంద్రబాబు నాయుడు మంగళగిరి సభలో చెబితే తాను అడ్డుకున్నానన్నారు. కావలిలో బీద రవిచంద్ర ఎందరో పార్టీ కోసం కష్టపడిన వారుంటే బీద మస్తాన్‌రావుకు ఆర్థిక బలాన్ని చూసి టికెట్ ఇచ్చారని మాట్లాడారని, ఆయనకు దమ్ముంటే 2024 ఎన్నికల్లో కావలిలో పోటీ చేసి గెలవాలన్నారు. ఆయన్ని ఓడించేందుకు బహుజనులంతా కంకణం కట్టుకుని ఉన్నారన్నారు. నగరంలో తమ ఎమ్మెల్యే అనిల్ చేసిన ప్రమాణం మీద విజ్ఞత కలిగిన పెద్దలు ఆలోచిస్తూ అభినందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేపై నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని టీడీపీ నాయకులకు హితవుపలికారు.

సంగీత, నృత్య కళాకారులకు పురస్కారాలు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న సుబ్బారావు, రఘురామిరెడ్డి

నెల్లూరు(బృందావనం): జిల్లాలో ప్రతిభ కలిగిన సంగీత, నృత్య కళాకారులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో కేతా సుబ్బారావు ప్రజావేదిక ఆధ్వర్యంలో సంగీత, కళ ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిరం ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కళలు, కళాకారులకు పుట్టినిల్లు అయిన సింహపురిలో ఎందరో తమ ప్రతిభాపాటవాలతో ఖ్యాతిని పొందారన్నారు. వారికి నీరాజనం పలుకుతూ వయోబేధం లేకుండా 20 మంది సంగీత, నృత్య కళాకారులను ఆగస్టు 8న సత్కరించనున్నట్లు తెలిపారు. ఎంపికైన కళాకారులు 20 మంది తప్పనిసరిగా ప్రదర్శనలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన కళాకారులు ఈ నెల 25వ తేదీలోగా వివరాలను కేతా సుబ్బారావు, మేరినాయుడువీధి, నక్కల్లోళ్లసెంటర్, సుబేదారుపేట,నెల్లూరు చిరునామాకు పంపాలని కోరారు. వివరాలకు 77299 42543 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో బీ రఘురామిరెడ్డి,షేక్ షఫీ,వీ సుబ్రహ్మణ్యం, రాము పాల్గొన్నారు.

వైద్యవిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



డాక్టర్ టీ రవికుమార్ దంపతులకు సత్కారం

నెల్లూరు(బారకాసు): వైద్యరంగంలో రోజురోజుకు వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రామీణ వైద్యులు నూతన వైద్యవిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రిచ్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. నగరంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో కమ్యూనిటి పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డివిజన్ కార్యవర్గ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు గ్రామీణ వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నూతన వైద్యవిజ్ఞానంపై రిచ్ హాస్పిటల్స్ నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు వసంతలక్ష్మి మాట్లాడుతూ గతంలో విజయవంతమైన శిశురక్ష కార్యక్రమాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. గతంలో శిశురక్ష కార్యక్రమం వందలాది మంది శిశువుల ప్రాణాలను కాపాడి ఎంతో మంది మాతృమూర్తులకు ఆనందాన్ని పంచిందని గుర్తుచేశారు. శిశురక్ష కార్యక్రమం విజయవంతానికి గ్రామీణ వైద్యుల భాగస్వామ్యం అవసరమన్నారు. భారత ప్రభుత్వ క్షేత్రప్రచార అధికారి నాగసాయిసూరి మాట్లాడుతూ కమ్యూనిటి పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ నూతన డివిజన్ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రయోజనాలు అందించేందుకు చొరవ చూపాలన్నారు. ప్రస్తుతం ప్రజలు సామాజిక మాధ్యమాల మీద ఆధారపడి సొంత వైద్యం చేసుకుంటున్నారని, ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింతగా అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటి పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, రాష్ట్రాధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, కోశాధికారి వేణుగోపాల్, నెల్లూరు, కావలి,గూడూరు, ఆత్మకూరు డివిజన్స్ నూతన అధ్యక్షులు శేషయ్య, రమణయ్య, శేఖర్, వెంకటేశ్వర్లు, జిల్లా కోకన్వీనర్ సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

రేపు 4వ డివిజన్‌లో జగనన్న సురక్ష

నెల్లూరు(బారకాసు): నగరంలోని 4వ డివిజన్‌లోని 4/1,2,3 వార్డు సచివాలయాలకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. 4వ డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని నివాసంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉదయగిరి నియోజకవర్గ మహిళా కమిటీపై చర్చించారు.

ఉచిత వైద్యశిబిరం



నెల్లూరు రూరల్: నగరంలోని పొదలకూరురోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నారాయణ ఆస్పత్రి వైద్యులు సుధీర్, ప్రభాకర్‌రాజు వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నారాయణరెడ్డి, డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, కృష్ణయ్య, రాజగోపాల్, అనంతరావు, హరిసుధా, ఎస్తేరురాణి, తదితరులు పాల్గొన్నారు.

వేణునాథం పుస్తకాల పంపిణీ



నెల్లూరు(మినీబైపాస్): జిల్లాలోని 61 గ్రంథాలయాలకు మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితి సంచిక ప్రవచన సుధాకరుని 'వేణునాథం'ను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆ పుస్తక కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు రేబాల వీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సీహెచ్ ప్రసాద్‌కు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేణునాథం పుస్తక కమిటీ సభ్యులు టీ రమణయ్య, మాజీ నెల్లూరు రూరల్ మండలాధ్యక్షుడు ఎం సుబ్రహ్మణ్యం, వీఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ మద్దూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెడుతున్నారు

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలోని 38వ డివిజన్‌లోని చిరువ్యాపారులను కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతున్నారని నేస్తం ఫౌండేషన్ నిర్వాహకుడు ప్రవీణ్ ఆదివారం సోషల్ మీడియా ద్వారా ఆరోపించారు. గత కొంతకాలంగా నేస్తం ఫౌండేషన్ ద్వారా సమాజ సేవ చేస్తున్న తనను ఇబ్బంది పెట్టాలని కొందరు పలు విధాలుగా ఒత్తిడిలు తెస్తున్నారన్నారు.

సింగిల్ నంబర్లాటపై దాడులు

- ఏడుగురి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సింగల్ నంబర్లాటపై వేదాయపాళెం పోలీసులు దాడులు చేశారు. ఇద్దరు నిర్వాహకులతో పాటు ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ ఆదేశాల మేరకు ఈ నెల 8న డైకస్‌రోడ్డు ఎన్‌సీసీకాలనీ మొదటివీధిలోని సింగిల్ నంబర్లాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకుడు శివాజీనగర్‌కు చెందిన ఎల్ నరసింహులుతో పాటు ఎన్‌సీసీ కాలనీకి చెందిన జూదరులు నరసింహారెడ్డి, వెంగళరావునగర్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం డైకస్‌రోడ్డు, వైటినాయుడు సందులోని ఖాళీ ప్రదేశంలో సింగిల్ నంబర్లాట నిర్వహిస్తుండగా దాడులు చేశారు. నిర్వాహకుడు వెంగళరావునగర్‌కు చెందిన షేక్ షామీర్, జూదరులు వెంగళరావునగర్‌కు చెందిన రబ్బాని, ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన రహమతుల్లా, ఇక్బాల్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దాడులు ముమ్మరం చేస్తున్నామన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఈ తరహా జూదాలు నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే డయల్ 112 లేదా 94407 96304 నంబర్లకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సమావేశం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ ప్రాంగణంలో స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన అసోసియేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు సమావేశానికి హాజరవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అసోసియేషన్ బలోపేతానికి సంఘటితంగా కృషిచేయాలన్నారు. అనంతరం సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా ఎం శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అబీదాసుల్తానా, జనరల్ జాయింట్ సెక్రటరీగా వీ ఆదినారాయణను ఎన్నుకున్నారు. జనరల్‌బాడీ మీటింగ్ అబ్జర్వర్‌గా చీఫ్ ప్యాటరన్ షేక్ మహబూబ్‌బాషా వ్యవహరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైస్‌చైర్మన్ త్రినాథ్‌రావు, వైస్ ప్రెసిడెంట్స్ నబీ సాహెబ్, ఖాదర్‌బాషా, జాయింట్ సెక్రటరీలు ఫహీమ్, హెచ్ షాకీర్, టెక్నికల్ డైరెక్టర్ ఎం ఖాజా, కోర్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, నరసింహులు, మన్సూర్‌బాషా పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమ మహోత్సవాల్లో భాగంగా పద్మావతినగర్‌లోని శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీసాయిమాత నిత్య అన్నప్రసాదాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో మాడరన్ ఐ ఆస్పత్రి వైద్యులు హెచ్ భారతి, ఎం సాయిరామ్‌చరణ్, ఎం రామసుబ్బారావు, డీ కుమారస్వామి, తదితరులు సుమారు 500 మందికిపైగా రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 90మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసినట్లు శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు. అద్దాల మందిరం గౌరవ సలహాదారు పొబోలు రామసుబ్బయ్య, యువసేవాదళ్ బృందం వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు



పొదలకూరులోని దేవస్థానం ప్రాంగణంలో పొంగళ్లు పెడుతున్న మహిళలు

పొదలకూరు : పట్టణంలో గంగమ్మతల్లి ఆలయంలో పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 3 గంటలకు మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

మనుబోలు : మనుబోలు పెద్ద చెరువు గట్టుపై కొలువున గంగమ్మ ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా పడిగినాటి శివయ్య, నల్లిబోయిన సుబ్రహ్మణ్యం వ్యవహరించారు.